క్లుప్తంగా

కంట్రోల్‌రూం ఏర్పాటు

హుజూరాబాద్: పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో వర్షాల దృష్ట్యా కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య మంగళవారం తెలిపారు. ప్రజలు ఏమైనా ఇబ్బందులు ఉంటే రాంరెడ్డి 97015 67478, రవీందర్‌రెడ్డి 94414 55916 ఫోన్ నంబర్లు సంప్రదించాలని సూచించారు.

పోలీస్‌స్టేషన్ సందర్శన



సిబ్బందితో మాట్లాడుతున్న ఏసీపీ జీవన్‌రెడ్డి

సైదాపూర్: హుజూరాబాద్ ఏసీపీ జీవన్‌రెడ్డి, హుజూరాబాద్ రూరల్ సీఐ సంతోష్ మంగళవారం సైదాపూర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్ పరిసరాలు, రికార్డులు పరిశీలించారు. నేరాలు, నేరస్తుల వివరాలు తెలుసుకున్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సిబ్బంది పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ ఆరోగ్యం, సిబ్బంది ఉన్నారు.

పండ్లతోటల పెంపకానికి దరఖాస్తు చేసుకోండి

మానకొండూర్‌రూరల్: మండలంలోని ఆసక్తి, అర్హులైన రైతులు ఉపాధి హామీ పథకం కింద 2023–24 సంవత్సరానికి పండ్లతోటల పెంపకానికి దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు తెలిపారు. మూడేళ్ల వరకు మొక్కల పర్యవేక్షణకు డబ్బులు అందజేస్తామన్నారు. బోరుబావి ఉన్న ఎస్సీ,ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులు 31వరకు ఎంపీడీవో కార్యాలయంలోని ఈజీఎస్ ఏపీవోకు దరఖాస్తులు అందజేయాలన్నారు.

నిధులు మంజూరు

రామడుగు: మండలంలోని వన్నారంలో నేతకాని భవనం మిగులు పనులకు రూ. 4 లక్షల నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ తెలిపారు. ఈమేరకు సంఘం సభ్యులకు ప్రొసీడింగ్ కాపీ అందించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

క్షీరాభిషేకం

వీణవంక: వీఆర్ఏలను క్రమబద్ధీకరిస్తూ సీఎం కేసీఆర్ జీవో జారీ చేయడంపై మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో వీఆర్ఏలు ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటామని అన్నారు. కార్యక్రమంలో వీఆర్ఏలు దుబాసి ప్రదీప్, ఓరెం చందర్, శ్రీనివాస్, దాసారపు రవీందర్, సముద్రాల శ్రీనివాస్, సుమలత, శ్రీవర్ష, భానుప్రసన్న, సుధాకర్ తదితరులు ఉన్నారు.

పిల్లలను బడికి పంపాలి



మాట్లాడుతున్న అధికారులు

తిమ్మాపూర్: పిల్లలు ఉండాల్సింది బడిలో, పనిలో కాదని ఎంపీడీవో రవీందర్‌రెడ్డి అన్నారు. ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి సమీపంలోని ఇటుక బట్టీలు, జూగుండ్ల సమీపంలోని క్వారీలను మంగళవారం తనిఖీ చేశారు. పిల్లలు పనిచేస్తున్నారా లేదా అని విచారణ జరిపి పిల్లలను పనిలో పెట్టుకోవద్దని యజమానులకు సూచించారు. నెలాఖరు వరకు తనిఖీలు కొనసాగుతాయని, పిల్లలతో పనులు చేయిస్తే చట్టప్రకారం కేసులు నమోదు చేస్తామని, తల్లిదండ్రులు పిల్లలను బడికి పంపించాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చైల్డ్‌లైన్ 1098 జిల్లా కోఆర్డినేటర్ సంపత్, ఎంఈవో శ్రీనివాస్ రెడ్డి, సూపర్ వైజర్ శ్రీలత, ఏఎస్ఐ నజీముద్దీన్, సీఆర్పీ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్స్, యజమానులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.







ఊపందుకున్న వ్యవసాయ పనులు

వీణవంక: వరుణుడు కరుణించడంతో పుడమితల్లి పులకరించింది. వరుసగా కురుస్తున్న వర్షాలతో రైతన్నలు వ్యవసాయపనుల్లో నిమగ్నమయ్యారు. వర్షాలను లెక్క చెయకుండా రైతులు వరి నాట్లు వేస్తున్నారు. హుజూరాబాద్ డివిజన్‌లో 84 వేల ఎకరాల్లో వరిపంట సాగులోకి వస్తుందని అధికారుల అంచనా. ఇప్పటివరకు 55వేల ఎకరాలలో నాట్లు వేశారని, మరో వారంలో నాట్లు పూర్తి కానున్నాయి. వానలు సకాలంలో కురవకపోవడంతో కొంతమంది రైతులు నారుమడి సిద్ధం చేసుకోలేదు. ఇప్పుడు విస్తారంగా వర్షాలు పడుతుండటంతో వరినారు కోసం తిప్పలు పడుతున్నారు. ఎకరానికి సరిపడా నారు రూ.1,500 కొనుగోలు చేస్తున్నారు. మరో రెండు రోజులు భారీ వర్షాలు ఉంటాయని వాతావరణశాఖ ప్రకటించడంతో ఈసారి పంటలకు ధోకా లేదని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం



రామడుగు: సీపీఐ నాయకుల నిరసన



హుజూరాబాద్‌లో...

హుజూరాబాద్: మణిపూర్ అల్లర్లను ప్రధాని పట్టించుకోవడంలేదని మంగళవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద సీపీఎం ఆధ్వర్యంలో మోదీ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా నాయకలు గీట్ల ముకుంద రెడ్డి, వెల్మారెడ్డి రాజిరెడ్డి మాట్లాడుతూ.. మణిపూర్‌లో అల్లర్లు జరుగుతుంటే మోదీ విదేశీ పర్యటనలు చేస్తున్నారని, అవకాశవాద రాజకీయాలతో దేశం పరువు తీస్తున్నారని అన్నారు. కమిటీ సభ్యులు వాసుదేవ్, రమేష్, తిరుపతి, ఎండీ అజ్జు, కుమార్, బి. రమాపతిరావు, మ్యాకం మహిపాల్, అడెపు అరవింద్, గుగిళ్ళ రాములు, తునికి అభిలాష్ పాల్గొన్నారు.

మానకొండూర్: మణిపూర్ దోషులను శిక్షించాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం మానకొండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కాల్వ మధుబాబు, మండల అధ్యక్షుడు ముక్కెర సతీశ్‌కుమార్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డిమాండ్ చేశారు. బీజేపీ అల్లర్లకు ఆజ్యం పోస్తుందని, కార్పొరేట్ సంస్థలకు ఖనిజ సంపదను దోచిపెట్టేందుకు ప్రయత్నిస్తోందని, దాడులు, అమానవీయ సంఘటనలు చోటుచేసుకుంటున్న మోదీ నోరు విప్పకపోవడంపై మండిపడ్డారు. సమావేశంలో కిషన్, శంకర్, సంపత్, రమేష్, ఐలయ్య, తదితరులుపాల్గొన్నారు.

శంకరపట్నం: మణిపూర్‌లో మహిళలపై పాశవిక చర్యను నిరసిస్తూ మండలంలోని కేశవపట్నంలో ప్రధాని నరేంద్రమోదీ దిష్టిబొమ్మను సీపీఐ నాయకులు దహనం చేశారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మణిపూర్ ప్రభుత్వాన్ని భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మండల కార్యదర్శి సమ్మయ్య, జిల్లా కార్యవర్గసభ్యుడు అశోక్, కిన్నెర మల్లమ్మ, యుగేందర్, సదానందం, రవి,తిరుపతి, లక్ష్మయ్య, వెంకటస్వామి, అంజలి, ఐలమ్మ, స్వరూప, రాజమ్మ పాల్గొన్నారు.

జమ్మికుంట: మణిపూర్ నిందితులను కఠినంగా శిక్షించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మను దహనం చేశారు. దేశంలో మహిళలకు రక్షణ కరువైందని, ప్రధాని అంటిముట్టనట్టు ఉంటున్నారని ఆరోపించారు. సీఎం బీరన్‌సింగ్‌ను భర్తరఫ చేయాలని, హోంమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో ప్రధాని ప్రకటన చేసే వరకు ఆందోళనలు, పోరాటాలు కొనసాగిస్తామని, భవిష్యత్తులో మహిళలపై అఘయిత్యాలు జరగకుండా సంఘటిత పోరాటాలు చేయాలన్నారు. జోన్ కార్యదర్శి అశోక్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రామడుగు: మణిపూర్ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నాయకులు మణిపూర్ బాధితులకు సంఘీభావంగా నిరసన చేపట్టారు. కులమతాల మధ్య చిచ్చు పెట్టడం సరికాదన్నారు. నిరసనలో తిరుపతి గౌడ్, ఎగుర్ల మల్లేశం, కీర్తి కుమార్, కనకయ్య, ఐలయ్య, రాజేశ్, శంకర్, తదితరులున్నారు.



శంకరపట్నం: ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న సీపీఐ నాయకులు

చేపల వలలో కొండచిలువ



సైదాపూర్: సైదాపూర్ న్యాల చెరువు నుంచి చేపలు బయటి పోకుండా జాలర్లు మత్తడి వద్ద ఏర్పాటు చేసిన వలకు మంగళవారం కొండచిలువ చిక్కింది. వెంటనే ఫారెస్టు అధికారులకు సమాచారం అందించారు. ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ రాజేశ్వర్‌రావు, సెక్షన్ ఆఫీసర్ సౌమ్య, బీట్ అధికారి సురేష్ కొండచిలువను సురక్షిత ప్రాంతానికి తరలించారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు బోనగిరి అనిల్,శ్రీకాంత్, సాయితేజ, అంజన్న, జాలర్లు ఉన్నారు.

నియామకం



జయపాల్‌రెడ్డి

వీణవంక: కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ మండల అధ్యక్షుడిగా మండలంలోని బొంతుపల్లి గ్రామానికి చెందిన చదువు జయపాల్‌రెడ్డిని నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు పత్తి క్రిష్ణారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈసందర్భంగా జయపాల్‌రెడ్డి మాట్లాడుతూ... రైతుల సమస్యలపై పోరాడుతానని, పార్టీ రైతులకు అండగా ఉంటుందన్నారు. నియామకానికి కృషి చేసిన మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కార్య నిర్వాహక అధ్యక్షుడు సాహెబ్‌హుస్సేన్, రాజమల్లయ్య, శీలం నరసింహారెడ్డి, జున్నుతుల మధుకర్‌రెడ్డి, పైడి కుమార్, చింతల హరీశ్‌రెడ్డి, రజాక్, సలీం ఉన్నారు.

కురుమ యువజన సంఘం

చొప్పదండి: పట్టణంలోని కురుమ యువజన సంఘం నూతన అధ్యక్షుడిగా జిట్ట కుమార్ ఎన్నికయ్యారు. మంగళవారం జరిగిన ఎన్నికల్లో జాతరగొండ సతీశ్‌పై 58 ఓట్ల మెజారిటీ సాధించాడు. ఉపాధ్యక్షుడిగా నిట్టు మునేశ్, ప్రధాన కార్యదర్శిగా కచ్చు సతీశ్, సంయుక్త కార్యదర్శిగా పెద్ది శ్రీనివాస్, కోశాధికారిగా పెద్ది సంపత్, కార్యదర్శిగా జాతరగొండ రాజశేఖర్ నియామకమయ్యారు. కార్యక్రమంలో తిరుపతి, బక్కయ్య, రాజు, కనకయ్య, శ్రీను, అనిల్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

బీసీ సెల్ జిల్లా కార్యదర్శిగా కూన కొమురయ్య



నియామక పత్రం అందిస్తున్న కవ్వంపల్లి

గన్నేరువరం: కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ విభాగం జిల్లా కార్యదర్శిగా గన్నేరువరం గ్రామానికి చెందిన కూన కొమురయ్య నియామకమయ్యారు. ఈమేరకు డీసీసీ అధ్యక్షుడు, మానకొండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కవ్వంపల్లి సత్యనారాయణ మంగళవారం కరీంనగర్‌లో నియామకపత్రం అందజేశారు. నియామకానికి సహకరించిన జిల్లా అధ్యక్షుడితో పాటు మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పులి ఆంజనేయులు, మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా సంయుక్త కార్యదర్శి అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శి బొడ్డు సునీల్, మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కొలుపుల రవీందర్, గ్రామశాఖ అధ్యక్షుడు చింతల శ్రీధర్ రెడ్డి, రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాల పరిశీలన



డ్రైనేజీని పరిశీలిస్తున్న తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు



చెరువును పరిశీలిస్తున్న ఎస్సై నర్సింహారావు

జమ్మికుంట: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పట్టణంలో హౌజింగ్‌బోర్డు కాలనీలోని డ్రెయినేజీలు, నాయిని చెరువు పరిసరాల్లోని లోతట్టు ప్రాంతాలను మంగళవారం మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు పరిశీలించారు. ఈసందర్భంగా నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శ్రీపతి నరేష్, మారెపల్లి భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

గన్నేరువరం: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై చందా నర్సింహారావు అన్నారు. గన్నేరువరంలోని పెద్ద చెరువును మంగళవారం పరిశీలించారు. రహదారులు, కల్వర్టులపై నుంచి వరదనీరు ప్రవాహించే సమయంలో వాహనదారులు, ప్రజలు జాగ్రత్తగా వెళ్లాలని తెలిపారు. చెరువులు, కుంటల్లో చేపలు పట్టడానికి వెళ్లొద్దని, విద్యుత్ స్తంభాలను, వైర్లలకు దూరంగా ఉండాలని సూచించారు. అత్యవసరమైతే తప్పా బయటకు రావొద్దని, ఇబ్బందులుంటే పోలీసులను సంప్రదించాలన్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారులు

మానకొండూర్: వర్షాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మానకొండూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కిరణ్‌కుమార్, డాక్టర్లు సాయి శ్వేత, అలేఖ్య, మైథిలీ ప్రజలకు అవగాహన కల్పించారు. మండలంలోని చెంజర్ల, అన్నారం, గంగిపల్లి, గ్రామాలలో ఉచితంగా హెల్త్ క్యాంపు నిర్వహించి జ్వరంతో బాధపడుతున్న వారికి రక్త పరీక్షలు చేశారు. అనంతరం మందులు పంపిణీ చేసి, శానిటేషన్, తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో రాజు నాయక్, హెల్త్ సూపర్‌వైజర్ రాజు, సరోజ, ఏఎన్ఎం శ్యామల, విజయేంద్ర, చంద్రకళ, విజయ, యాదా, జయమణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



గుంతలమయంగా బస్టాండు రోడ్డు

గంగాధర: కరీంనగర్-జగిత్యాల ప్రధాన రహదారి గంగాధర మండలం మధురానగర్ చౌరస్తాలోని బస్టాండ్‌లోకి వెళ్లే ప్రధాన రోడ్డు అధ్వానంగా తయారైంది. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డుపై ఏర్పడిన గుంతలు నిండిపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతు చేయాలని కోరుతున్నారు.

పలువురికి ఆర్థికసాయం అందజేత



గంగాధర: ఆర్థికసాయం అందిస్తున్న దాతలు



నగదు అందిస్తున్న సర్పంచ్ భూంరెడ్డి

గంగాధర: మండలంలోని గర్శకుర్తి గ్రామానికి చెందిన వేల్పుల నవ్య పైలెట్ శిక్షణ పొందుతూ ఫీజుల చెల్లింపునకు ఇబ్బంది పడుతోంది. ఈసందర్భంగా ఆర్థికసాయం అందించేందుకు దాతలు ముందుకు వస్తున్నారు. గ్రామంలోని ఎడ్ల భాగ్యలక్ష్మి ఫిల్లింగ్ స్టేషన్ యజమానులు శ్రీనివాస్, వేణుగోపాల్, మేనేజర్ బండారి రవి రూ. పదివేలు మంగళవారం నవ్య తల్లిదండ్రులకు అందజేశారు. కార్యక్రమంలో జనార్దన్, చిప్ప వెంకటస్వామి, గజ్జల శ్రీనివాస్, పొత్తూరి సురేశ్, దాసరి రాజు తదితరులు ఉన్నారు.

చొప్పదండి: మండంలోని ఆర్నకొండ గ్రామానికి చెందిన నిరుపేద కూలి మ్యాకల అజయ్య ఇటీవల మృతిచెందాడు. మృతుడి కుటుంబానికి రిటైర్డ్ ఆర్డీవో బైరం పద్మయ్య మంగళవారం రూ. 5 వేల ఆర్థికసాయం అందించారు. ఈకార్యక్రమంలో గంగయ్య, కిషన్, రవి, అంజయ్య, రాజమల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

చిగురుమామిడి: మండలంలోని బొమ్మనపల్లి గ్రామానికి చెందిన కొంకట పోచవ్వ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. ఆమె కుటుంబ సభ్యులకు మంగళవారం గ్రామ పంచాయతీ పాలకవర్గం రూ.పదివేల ఆర్థికసాయం అందించారు. పోచవ్వ గతంలో గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికురాలిగా పనిచేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కానుగంటి భూంరెడ్డి, ఉపసర్పంచ్ పెండ్యాల శారదసదానందం, ఎంపీటీసీ మిట్టపెల్లి మల్లేశం, పంచాయతీ కార్యదర్శి రమణారెడ్డి పలువురు వార్డు సభ్యులు, తదితరులున్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



తిమ్మాపూర్: మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ క్యాంపు కార్యాలయం పీఏ వరప్రసాద్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. మంగళవారం ఎమ్మెల్యే రామకృష్ణకాలనీలోని వరప్రసాద్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు.

కొనసాగుతున్న జీపీ కార్మికుల సమ్మె



హుజూరాబాద్: సమ్మెకు మద్దతు తెలుపుతున్న నాయకులు



జమ్మికుంటలో కార్మికుల నిరసన



గంగాధర: సమ్మె చేస్తున్న కార్మికులు

హుజూరాబాద్: జీపీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. ఎంపీడీవో ఆఫీస్ ఎదుట కార్మికులు చేస్తున్న సమ్మెకు మంగళవారం మద్దతు తెలిపారు. కార్మికులను పర్మినెంట్ చేయాలని, వేతనాలకు ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని, మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలలన్నారు. కార్యక్రమంలో రమాపతిరావు, మహిపాల్, కిషోర్ పాల్గొన్నారు.

జమ్మికుంట: పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఎదుట పంచాయతీ సిబ్బంది, కార్మికుల జేఏసీ ఆధ్వర్యంలో చేస్తున్న సమ్మె కొనసాగుతోంది. మల్టీపర్పస్ విధానం రద్దు చేసి, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం, 51జీవో సవరించి రూ. పది లక్షల ప్రమాద భీమా సౌకర్యం కల్పించాలని డిమాండు చేస్తున్నారు. స్పెషల్ డ్రైవ్ పేరుతో పంచాయతీ కార్మికులతో వెట్టి చాకిరి చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో రవీందర్‌రావు, సతీష్, మధుకర్, రవి, మొగిలి, భద్రయ్య, సంపత్, రాజన్న, ఉమా, ప్రవీణ్, సారయ్య కార్మికులు పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నంలో మంగళవారం గ్రామ పంచాయతీ కార్మికులు వంటావార్పుతో నిరసన తెలిపారు. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేపట్టిన సమ్మె 20వ రోజుకు చేరింది. సమ్మెకు సీపీఎం నాయకుడు గీట్ల ముకుందర్‌రెడ్డి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో రాచర్ల మల్లేశం, సారయ్య, తదితరులు ఉన్నారు.

గంగాధర: మండలంలోని 33 గ్రామ పంచాయతీల్లోని పారిశుధ్య కార్మికులు డిమాండ్లు నెరవేర్చాలని మండల కేంద్రంలో సమ్మె చేస్తున్నారు. ప్రభుత్వం పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, కారోబార్లు, బిల్‌కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలని, విధి నిర్వాహణలో మరణిస్తే రూ. పదిలక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు.